


నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | సోమవారం 28 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల



ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌లో చేప పిల్లల్ని వదులుతున్న అదనపు కలెక్టర్

హాజీపూర్, అక్టోబర్ 27 : హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ఆదివారం అధికారులతో కలిసి 32 వేల చేప పిల్లలను మంచిర్యాల అదనపు కలెక్టర్ ( రెవెన్యూ) సభావత్ మోతీలాల్ వదిలారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టులో మొత్తం 24 లక్షల చేప పిల్లలకు గాను 12 లక్షల చేప పిల్లల మంజూరు కాగా ఇందులో మొదటి విడుతగా 32 వేల చేప పిల్లల్ని వదిలినట్లు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట రవి, శ్రీనివాస్ గౌడ్, ఒడ్డె బాలరాజు, శ్రీశైలం గౌడ్, తదితరులున్నారు.



దండేపల్లి : కాకో ఆలయ ఆవరణలో గుస్సాడీల నృత్యాలు

# రేలారే.. రేలా..

## గుస్సాడీ నృత్యాలతో హోరెత్తించిన ఆదివాసులు

- వైభవంగా దండారీ సంబురాలు
- గుడిరేవులోని పద్మల్‌పురి కాకో అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- నేడు దర్బార్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు



దండేపల్లి : కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న ఆదివాసులు



కెరమెరి : కోలాట ప్రదర్శనలో దండారీ బృందాలు

దండేపల్లి, అక్టోబర్27 : దండారీ వేడుకల్లో భాగంగా 'రేలారే రేలా' పాటలపై గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు హోరెత్తించారు. దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరంలోని ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం పద్మల్‌పురి కాకో ఆలయానికి దర్బార్‌కు ఒక రోజు ముందు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు ఆలయానికి చేరుకొని సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. దండారీ ఉత్సవాల్లో భాగంగా రేలా...రేలా...అని పాడుతూ గుస్సాడీ నృత్యాలు చేశారు. మహిళలు కూడా సంప్రదాయబద్ధంగా నృత్యాలతో సందడి చేశారు. సెలవుదినం కావడంతో భక్తులతో గోదావరి తీరం వద్ద సందడిగా మారింది. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. పద్మల్‌పురి కాకో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మేకలు, కోళ్లు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం సమీపంలో వంటలు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. సోమవారం నిర్వహించనున్న గుస్సాడీ దర్బార్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

### మోడి గ్రామంలో ఆకట్టుకున్న నృత్యాలు..

కెరమెరి, అక్టోబర్ 27: జైనూర్ మండలం ఆసేపల్లికి చెందిన దండారీ బృందం శనివారం రాత్రి మోడి గ్రామానికి అతిథులుగా వచ్చారు. ఆదివారం ఉదయం వారు సంప్రదాయ వాయిద్యాలతో ప్రదర్శించిన గుస్సాడీ నృత్యాలు, కోలాటాల ప్రదర్శన, హాస్యనాటికలు, జానపద గేయాలు, దేవత ప్రతిమలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను చూసేందుకు పక్క గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

### సల్పాల వాగు వద్ద ఘనంగా దర్బార్..

కాసిపేట, అక్టోబర్ 27 : కాసిపేట మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు సమీపంలోని ఆదివాసీల ఆరాధ్య దైవం వెంకటాద్రి ఆలయం వద్ద ఆదివారం దండారీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆదివాసీ సంస్కృతిపై గుస్సాడీ, దండారీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం దండారీ దర్బార్ నిర్వహించి ఆదివాసీ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్, హెచ్ ఆర్ హెడ్ కులకర్ణి ఆధ్వర్యంలో భోజన వసతి, ఇతర సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో దండారీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆడె జంగు, పెంద్రం హన్మంతు, మడావి వెంకటేశ్, మడావి అనంతరావు, ఆత్రం జంగు, వెడ్మ కిషన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, సొసైటీ మాజీ చైర్మన్ పూస్కూరి వంశీకృష్ణా రావు, నాయకులు, ఆదివాసులు పాల్గొన్నారు.



దండేపల్లి : డప్పు చప్పుళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు..



కాసిపేట : నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు



దండేపల్లి : కాకో ఆలయం వద్ద సంప్రదాయ నృత్యాలు చేస్తున్న ఆదివాసులు



కెరమెరి : ఆదివాసీ దేవతల వేషధారణలో కళాకారులు

## అడవుల రక్షణపై శ్రద్ధ చూపాలి

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు
- కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఎఫ్‌డీపీటీ, జిల్లా కన్జర్వేటర్ శాంతారాం
- తానిమడుగు బీట్‌లో నరికివేసిన టేకుచెట్ల పరిశీలన

దండేపల్లి, అక్టోబర్27: అడవులను రక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఎఫ్‌డీపీటీ, జిల్లా కన్జర్వేటర్ శాంతారాం హెచ్చరించారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట రేంజ్ పరిధిలోని తానిమడుగు బీట్‌లో అక్రమంగా టేకు చెట్లు నరికివేసిన ప్రదేశాన్ని మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) శివ్ ఆశీష్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేకు చెట్లు నరికివేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలని ఆదేశించారు. అడవులతో పాటు వన్య ప్రాణుల సంరక్షణకు సమీప గ్రామాల్లోని ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జన్నారం డివిజన్ పరిధిలోని విద్యార్థులకు సీతాకోక చిలుకల సర్వే, పక్షులపై సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జన్నారం డివిజన్ సిబ్బందితో ప్రొటెక్షన్ మీటింగ్ నిర్వహించి అడవుల రక్షణకు సంబంధించి పలు కీలక సూచనలు అందించారు. అడవుల రక్షణ కోసం పాటు పడాలని, విధులపై నిర్లక్ష్య ధోరణి తగదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మారావు, మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో రమాదేవి, ఎఫ్ఎస్వో, ఎఫ్‌బీవో, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.



నరికివేసిన టేకు చెట్లను పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ, డీఎఫ్‌వో, అధికారులు

## ఎస్సీ రైతుల సంక్షేమమే ధ్యేయం

కిసాన్ మేళాలో సీఆర్ఐడీఏ డైరెక్టర్ వీకే సింగ్

కోటపల్లి, అక్టోబర్ 27 : గ్రామీణ ఎస్సీ రైతుల సంక్షేమమే కేంద్రీయ మెట్ట ప్రాంత వ్యవసాయ పరిశోధనా సంస్థ (సీఆర్ఐడీఏ) ధ్యేయమని డైరెక్టర్ వీకే సింగ్ అన్నారు. కోటపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం సీఆర్ఐడీఏ ఆధ్వర్యంలో కిసాన్ మేళా నిర్వహించి మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే 4000 మంది రైతులకు వ్యవసాయ రంగ ఉత్పత్తులను అభివృద్ధికి శాస్త్రవేత్తలతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు రైతులకు ఉచితంగా శనగలు, కందులు, పెసళ్లు, శనగలు, కూరగాయల విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు పంపిణీ చేయడంతో పాటు మట్టి పరీక్షలు జరిపి వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఐడీఏ నోడల్ ఆఫీసర్ టీవీ ప్రసాద్, సీఏవో బీకే సిన్హా, ఏడీఏ ప్రసాద్, ఏఈవో రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు వెంకటేశ్, శ్రీదేవి శంకర్, గోపాల కృష్ణ, ఆశిష్, అన్షిదా, విషాకుమారి, జాగృతి, కో ఆర్డినేటర్లు సంపత్, సునీల్ పాల్గొన్నారు.



కోటపల్లిలో నిర్వహించిన కిసాన్ మేళాలో డ్రోన్ పరికరాన్ని పరిశీలిస్తున్న సీఆర్ఐడీఏ డైరెక్టర్ వీకే సింగ్

## పోలీస్ బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళన

- ధర్నాలో పాల్గొన్న వారిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్



గుడిపేటలోని పోలీస్ బెటాలియన్ ఎదుట నిరసన తెలుపుతున్న కానిస్టేబుళ్లు

హాజీపూర్, అక్టోబర్ 27 : ఏక్ పోలీస్ విధానం కోసం ధర్నాలో పాల్గొన్న కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని 13వ పోలీస్ బెటాలియన్ ఎదుట కానిస్టేబుళ్లు నిరసన తెలిపారు. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం కానిస్టేబుళ్లు, వారి భార్యలు, కుటుంబ సభ్యులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఫ్లైవర్ బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న ఐదుగురు గుడిపేట బెటాలియన్ కానిస్టేబుళ్లను అధికారులు సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆదివారం కానిస్టేబుళ్లు బెటాలియన్ ఎదుట ఆందోళనకు దిగారు. సమస్యలను పరిష్కరించే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం బెటాలియన్ కమాండెంట్ పీ వెంకట్రాములుకు వినతి పత్రం అందజేశారు. బెటాలియన్ వద్ద ఎస్ఐ గోపతి సురేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

- ప్రాణహితలో గల్లంతైన వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం
- మరో యువకుడి కోసం గాలిస్తున్న రెస్క్యూటీం

బెజ్జూర్, అక్టోబర్ 27 : బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం సోమిని గ్రామంలో ఎర్రబండ రేవు వద్ద ప్రాణహిత నదిలో ఈతకు వెళ్లి గల్లంతవగా అందులో ఇద్దరి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. గల్లంతైన వారి కోసం ఆదివారం ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు, గజ ఈతగాళ్లు కుటుంబ సభ్యులు గాలించగా తలాయి గ్రామ సమీపంలో ప్రాణహిత నదిలో ఉదయం మత్స్యకారుల వలకు జహీర్ హుస్సేన్(23) మృతదేహం చిక్కింది. మరో ఇద్దరి కోసం మహారాష్ట్ర రెస్క్యూ టీం, బెజ్జూర్ పోలీసులు గాలిస్తుండగా సాయంత్రం అక్కడే ఇర్షాద్(20) మృతదేహం లభ్యమైంది. మరో యువకుడు మోహిజ్(19) కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ..

మండలంలోని సోమిని ఎర్ర బండ ప్రాంతంలో ఈతకు వెళ్లి ముగ్గురు గల్లంతైన విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదివారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మరో యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పుష్పలత, చింతలమానేపల్లి మాజీ ఎంపీపీ నానయ్య, టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాశ్, తదితరులున్నారు.



జహీర్ హుస్సేన్ మృతదేహాన్ని ప్రాణహిత నుంచి బయటకు తెస్తున్న పోలీసులు, గ్రామస్తులు

## బాధితుడికి న్యాయం చేస్తాం

- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్
- అధిక విద్యుత్ బిల్లుపై విచారణ



న్యాయం చేయాలని ఎస్ఈ శ్రావణ్‌కు విన్నవిస్తున్న బాధితుడు గట్టు సంపత్‌గౌడ్

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 27: చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన అధిక విద్యుత్ బిల్లు బాధితుడు గట్టు సంపత్ గౌడ్‌కు న్యాయం చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ భరోసానిచ్చారు. 8 సంవత్సరాల మీటర్ రీడింగ్ అంతా కలిపి ఒక్కసారి బిల్ కొట్టడంతో రూ. 1,47,222 వచ్చిందని. ఈ విషయంపై డీఏ కైసర్‌తో కలిసి కొమ్మెర గ్రామంలోని బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి మీటరును పరిశీలించారు. ఏండ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని ఎస్ఈకి చెబుతూ బాధితుడు వాపోయాడు. 8 ఏండ్లుగా వినియోగదారుడి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని అధికారులపై ఎస్ఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి అధికారులు బదిలీపై వెళ్లారని ఏఈ శ్రీనివాస్ వివరించారు. మీటరును ఎల్‌టీ ల్యాబ్ చెకింగ్‌కు పంపించి, సమస్యను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారంలోపు సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఈ శ్రావణ్ తెలిపారు. మళ్లీ ఇలాంటి సమస్యలు పునరావృతం కావద్దని, సమస్య తీవ్రంగా ఉంటే ఉన్నతాధికారులను తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, లైన్‌మన్లు రమేశ్ రెడ్డి, తిరుపతయ్య ఉన్నారు.

## జెండా పూజ పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 27 : ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం చౌక్‌లో గల భీమ్ విగ్రహం వద్ద నిర్వహించనున్న స్మారక జెండా పూజ పోస్టర్‌ను నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. గిరిజనుల ఆరాధ్య దైవం కుమ్రం భీమ్ స్మారక జెండా పూజకు ఆదివాసులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోండ్వాన రాష్ట్ర అధ్యక్షుడు సిడాం రాజు, రాయి సెంటర్ జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, సర్మెడి గణేశ్, కుమ్రం భీం వారసులు కుమ్రం వెంకటేశ్, కుమ్రం రాము, అంబరావు పాల్గొన్నారు.



ఆదివాసీ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి